చెస్ శిక్షణ తరగతులు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత చదరంగం శిక్షణ తరగతులను అజిత్‌సింగ్‌నగర్, మారుతీనగర్, పోరంకిలో బుధవారం ప్రారంభమయ్యాయి. కోచింగ్ అకాడమీ చీఫ్ ఆర్బిటర్ ఎస్.ఎం.ఫణికుమార్ ఈ తరగతులను ప్రారంభించారు. సింగ్‌నగర్, పోరంకి ప్రాంతాల్లో సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు, మారుతీనగర్‌లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. నేషనల్ ఆర్బిటర్ ఎం.డి.గఫూర్, కోచ్ జి.రామకృష్ణ క్రీడాకారులకు శిక్షణ ఇస్తారని తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చిట్టినగర్ తాడికొండయ్య వీధికి చెందిన చిలకలపూడి లక్ష్మీకి కృష్ణా జిల్లా మొవ్వకు చెందిన నాగరాజుకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. కొంత కాలంగా నాగరాజు భార్యను వేధింపులకు గురి చేయడంతో పాటు పుట్టింటికి వెళ్లి అదనంగా కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. భర్త వేధింపులకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మహిళా విద్యా ప్రదాత సావిత్రీబాయి పూలే

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్య ద్వారానే సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపటం సాధ్యమని, అందుకు స్త్రీలకు విద్య చాలా అవసరమని గ్రహించిన సావిత్రీబాయి పూలే వారికి విద్యను అందించారని పలువురు ఉపాధ్యాయినులు పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ పరిధిలోని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు బసంతికుమారి మాట్లాడుతూ మహిళలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ సత్యనారాయణ, ఎం.నరసింహారావు, ఉపాధ్యక్షుడు ఆర్.గోపాలం, కోశాధికారి డీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొండ ప్రాంత సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లో చోటు చేసుకున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్ 184వ సచివాలయం పరిధిలోని ఆంజనేయవాగులోని కొండ ప్రాంతాలలో బుధవారం స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అధ్యక్షతన ఎమ్మెల్యే వెలంపల్లి పర్యటించారు. కొండ ప్రాంతంలోని గడపగడపకూ వెళ్లి నివాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును వివరించారు. వాగు సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి బయలుదేరిన ఎమ్మెల్యే కొండపై వీధుల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని అర్హతలు ఉన్నవారందరికీ అన్ని పథకాలు అమలవుతున్నాయన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి

అర్హులందరికీ పథకాలు అందాలి

డివిజన్‌లో అర్హులందరికీ పథకాలు అందాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సచివాలయం సిబ్బందికి సూచించారు. కొండ ప్రాంతంలోని 164వ సచివాలయాన్ని సందర్శించిన వెలంపల్లి సిబ్బందితో సమావేశమయ్యారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, నాయకులు కొరగంజి భాను, వనుకు ఫణీ, రామకృష్ణ, సూర వెంకట్రావు, విజయ్, పిళ్లా ఆనంద్, కనిశెట్టి వెంకటేశ్వరరావు, అయితా కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా కూడరైవల్లి మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా కూడరైవలీ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవి, పద్మావతి అమ్మవార్లను వేంచేయించి తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు, అర్చకస్వాములు పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి పాల్గొన్నారు.



శ్రీవారి సన్నిధిలో గోదాదేవికి విశేష అర్చనలు

కొత్తగుళ్ల ప్రాంగణంలో..

వన్‌టౌన్‌లోని కోదండరామ స్వామి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలో కూడరైవల్లి ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను పులిపాక రాఘవాచార్యులు, అంజనేయాచార్యులు నిర్వహించారు.

కోదండరామసన్నిధిలో..

కొత్తపేట భావనారాయణవీధిలోని కోదండరామస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకుని కూడరైవల్లి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాఘవేంద్రదీక్షితులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని యద్దనపూడివారి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు నిర్మాణ పనులను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ 314 మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పుతో రూ.40లక్షల వ్యయంతో ఈ సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఇదే రోడ్డులో ఆరు కల్వర్ట్‌ల నిర్మాణ పనులు కూడా ప్రారంభమవుతాయని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

వీధి కుక్కల పట్టివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా రోడ్‌లోని రాము క్వారీ ప్రాంతంలోని వీధి కుక్కలను నగరపాలక సంస్థ సిబ్బంది పట్టుకున్నారు. రెండు రోజుల క్రితం ఈ ప్రాంతంలో ఒక పిచ్చి కుక్క సుమారు పది మందిని కరవడంతో బాధితుడు, స్థానిక సోషల్ వర్కర్ డీ రాము మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సతీష్, సూపర్‌వైజర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు బుధవారం తమ సిబ్బందితో వచ్చి పలు వీధి కుక్కలను పట్టుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుదాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైవే రోడ్‌లోని వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, అలాగే ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణ కుమారి వీధి, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, అవుట్ ఏజెన్సీ ఏరియా, మీరా సాహెబ్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గౌతంరెడ్డికి అభినందనలు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పూనూరు గౌతంరెడ్డిని పలువురు యూనియన్ నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ హౌస్‌లోని ఆయన కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాజారెడ్డి, రాష్ట్ర నాయకులు నరహరిశెట్టి శ్రీహరి, నారాయణరెడ్డి, వెంకటప్పారెడ్డి, సురేష్, రాజేష్ తదితరులు కలిసి అభినందనలను తెలిపారు.



గౌతంరెడ్డిని అభినందిస్తున్న నాయకులు

వ్యక్తిగత అభివృద్ధి విద్యతోనే సాధ్యం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వ్యక్తిగత అభివృద్ధి విద్యతోనే సాధ్యమని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డీపీఓ ముత్యాల బాలమురళీధర్ పేర్కొన్నారు. బుధవారం సత్యనారాయణపురంలోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన మెనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యాలయంలో 2022-23 సంవత్సరంలోని కార్యకలాపాలపై కమిటీ సభ్యులతో ఆయన సమీక్షించారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వేంకటేశ్వరరావు, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగువారి ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిత్యం ఎడిబుల్ ఆయిల్ కంపెని సౌజన్యంతో బుధవారం విద్యాధరపురంలోని దళవాయి సుబ్బారామయ్య మున్సిపల్ హైస్కూల్ (డీఎస్ఎం), మైలవల్లి పోలీస్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, డీఎస్ఎమ్ హైస్కూల్ హెచ్ఎం మాతంగి కోటయ్య పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వృద్ధుడిపై దాడి చేసి పొలం పత్రాలను, నగదును లాక్కుని వెళ్లిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కొత్తపేట మాకిన వారి వీధికి చెందిన పిళ్లా గోపాలరావుకు పీ.నైనవరంలో 78 సెంట్ల పొలం ఉంది. గోపాలరావు తండ్రి వద్ద నుంచి వచ్చిన పొలం వారి ఆధీనంలోనే ఉంది. గత నెల 14వ తేదీన కొంత మంది ఆ పొలాన్ని ఆక్రమించుకుంటున్నారని తెలుసుకుని గోపాలరావు అక్కడికి వెళ్లాడు. దావు వెంకటేశ్వరరావు, రాయన దుర్గాంబ, రాయన శివ, పామర్తి వెంకటేశ్వరమ్మ పొలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా గోపాలరావును బెదిరించారు. అదే రోజు గ్రామంలోని గాంధీబొమ్మ వద్దకు వచ్చి నరికి వెంకటేశ్వరరావుతో పాటు మిగిలిన వారందరూ వృద్ధుడిపై దాడి చేసి పొలం పత్రాలు, నగదును లాక్కుని పారిపోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ముగ్గుల పోటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండగను పురస్కరించుకుని జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో బుధవారం భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లుల్లో సృజనాత్మకత వెల్లివిరిసింది. ముఖ్యఅతిథిగా 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి హాజరయ్యి మహిళలను అభినందించారు. జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ పూర్ణిమ, సచివాలయ మహిళా పోలీస్‌వెంకట లక్ష్మి మాట్లాడుతూ మహిళలు వేసిన ముగ్గులు పల్లె వాతావరణాన్ని తలపిస్తున్నాయన్నారు. పోటీలో జీ అరుణ, ఎస్ శ్రీలక్ష్మి, సౌజన్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నారు.

డేటా ఎనాలసిస్ రంగంలో విస్తృత అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ వ్యాపితంగా డేటా ఎనాలసిస్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని కేఎల్ విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ శివకుమార్ అన్నారు. కేబీఎన్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఆధ్వర్యంలో «పైథాన్ ఫర్ డేటా ఎనాలసిస్» అంశంపై ఐదు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ముగింపు సభలో డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా డేటా ఎనాలసిస్ రంగానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. దీనిపై పట్టు సాధించడం ద్వారా ఆయా అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను, అభివృద్ధిని తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అధ్యాపకులు లక్ష్మిప్రసన్న, పీహెచ్ రాధ, డాక్టర్ పీ శేషుబాబు, డాక్టర్ సీహెచ్‌వీవీఎస్ సురేశ్, సీహెచ్ సౌజన్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

హనుమత్‌దీక్షా పీఠంలో శ్రీలక్ష్మీ హయగ్రీవ యజ్ఞం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అభయ వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో శ్రీలక్ష్మి హయగ్రీవ యజ్ఞం, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. స్వామిని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు దర్శించుకున్నారు. దుర్గాప్రసాద్ స్వామిజీ అనుగ్రహ భాషణ, దివ్య మంగళ శాసనాలు అందజేశారు.



విజయ డెయిరీ చైర్మన్ ఆంజనేయులుకు ప్రసాదాలు అందజేస్తున్న స్వామీజీ

ఆర్టీసీ అభివృద్ధికి కృషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీఎస్ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి అన్నారు. ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో కష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆదుకుంటే.. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశారన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు, విద్యాధరపురం డిపో ప్రెసిడెంట్ కేఎం లక్ష్మణుడు, డీఎస్ సాగర్, ఎంఆర్ కోటేశ్వరరావు, టీ సూరిబాబు, పీ వెంకటేశ్వరరావు, వీజే రత్నం పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీల నియామకంపై మార్గదర్శకాలను తెలియజేశారు. నగరంలోని యూపీహెచ్‌సీ ఉన్న ప్రాంత కార్పొరేటర్ చైర్మన్‌గా , డీపీయంఓ/ప్రోగ్రామ్ అధికారి కో చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. కాగా యూపీహెచ్‌సీ వైద్యాధికారి కన్వీనర్‌గా, మున్సిపల్ కమిషనర్, ప్రజారోగ్య అధికారి, మహిళా శిశు సంక్షేమశాఖ సెక్టార్ సూపర్‌వైజర్, మహిళా ఆరోగ్య సమితి చైర్‌పర్సన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటరీ సెక్రటరీలో సభ్యులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్‌సీడీ,సీడీ, ఆర్‌సీహెచ్ ప్రగతి, ఏఎన్‌సీ, పీఎన్‌సీ, హై రిస్క్ కేసులకు అందిస్తున్న సేవలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినిదేవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, ఆర్‌బీఎస్‌కే సమన్వయాధికారి డాక్టర్ మాధవి, డీపీఓ మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రథమ వర్ధంతి



జననం:
31-01-1972

మరణం:
12-01-2022

శ్రీమతి కళ్ళే లలిత గారు

మంచితనం, మమతానురాగాలు మాకు పంచి ఆత్మీయత, అనుబంధాలతో మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకొని మాకై జీవితాంతం శ్రమించి మా జీవితాలకు బంగారుబాట ఏర్పాటు చేసిన కీ॥శే॥ శ్రీమతి కళ్ళే లలిత గారు మా నుండి దూరమై నేటికి ఒక సంవత్సరం గడిచినా మీ మధుర జ్ఞాపకాలు మరువలేకున్నాం.. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భర్త : **కళ్ళే నాగేశ్వరరావు**

కుమార్తెలు - అల్లుళ్ళు :

సీతామహాలక్ష్మి - ముప్పూరి హరీష్
జయదుర్గ - గుద్దిటి కిరణ్‌కుమార్
మేఘవాణి - వేల్పుల నూతన్ కుమార్

మనుమలు: ముప్పూరి జశ్విన్, గుద్దిటి ధృవన్

మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

సంవత్సరీకం : ది. 12-01-2023 గురువారం బందరు రోడ్డు, A+ కన్వెన్షన్ నందు జరుగును.

విగ్రహావిష్కరణ : నా ప్రియ మిత్రులు శ్రీ బుద్ధా వెంకన్న - శ్రీమతి భూలక్ష్మీ దంపతులచే సింగ్‌నగర్, రైతుబజార్ దగ్గర కళ్ళే లలిత వారి వీధిలో కీ॥శే॥ శ్రీమతి కళ్ళే లలిత గారి విగ్రహావిష్కరణ జరుగును.